క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మియాపూర్: 11కేవీ సురక్ష, ఫ్రెండ్స్ కాలనీ ఫీడర్ల మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సురక్ష ఫీడర్ పరిధిలోని కైలాష్‌నగర్, విద్యానగర్, సురక్ష ఎన్‌క్లేవ్, పద్మజా కాలనీ, సురక్ష కాలనీ, రాజేంద్రారెడ్డినగర్, శుభోదయ ఎన్‌క్లేవ్, డిఫెన్స్ కాలనీ, సత్య ఎన్‌క్లేవ్, అపర్ణ అపార్ట్‌మెంట్ అదే విధంగా మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు ఫ్రెండ్స్ ఫీడర్ పరిధిలోని అర్జున్‌రెడ్డి కాలనీ, వెస్ట్ మెట్రో అపార్ట్‌మెంట్, ఫ్రెండ్స్ కాలనీ, శిల్పా ఎన్‌క్లేవ్, సాయిజ్యోతి అపార్ట్‌మెంట్ కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 120, పచ్చిమిర్చి 120, బెండ 40, కాకర 60, దొండ 40, దోస 30, ఆలు 25, చామ 50, కీర 50, బీర 50, వంకాయ 35, గోకర 50, బీన్స్ 120, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 25, క్యారెట్ 70, చిక్కుడు 80, ఉల్లి 100 (5 కేజీలు), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 40 సొరకాయ (కేజీ) 30, అల్లం 250, వెల్లుల్లి 160.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

పటాన్‌చెరు టౌన్: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నతస్థాయికి ఎదగాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ సూచించారు. అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడలోని వివిధ కాలనీలకు చెందిన యువకులకు ఆదివారం క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేసేందుకే ఎన్‌ఎంఆర్ యువసేనను స్థాపించానని తెలిపారు. మీరు అండగా ఉంటే నియోజకవర్గ ప్రజలకు సేవచేస్తూనే ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు, యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నా కుమారుడిని ఆశీర్వదించండి

ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎమ్మెల్యే భిక్షపతి వినతి



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మదీనాగూడ గ్రామంలోని మహిళలు, వృద్ధులతో ఆదివారం మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అందరినీ కలిసి గతంలో తాను చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో తన కుమారుడు బీజేపీ నుంచి బరిలో ఉంటాడని, మీ అందరి ఆశీర్వాదాలు ఉండాలని ఆత్మీయ సమ్మేళనంలో కోరారు. కార్యక్రమంలో మదీనాగూడ గ్రామస్తులు, మహిళలు, వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

కిర్బీలో విజయం మాదే..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఈనెల 5వ తేదీన కిర్బీ పరిశ్రమలో జరగనున్న యూనియన్ ఎన్నికలో సీఐటీయూ ఘన విజయం సాధించడం ఖాయమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. ఆదివారం పట్టణంలో కార్మికులతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు సీఐటీయూ ఆధ్వర్యంలో మంచి వేతన ఒప్పందం చేశామని.. 113 మంది కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయించిన ఘనత సీఐటీయూకే చెందుతుందని తెలిపారు. మూడోసారి తమకు అండగా ఉండి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య, నాయకులు పాండురంగారెడ్డి, నరసింహారెడ్డి, వి.ఎస్.రాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి చదువుకు ఆర్థిక సాయం



కూకట్‌పల్లి: ఆర్థిక ఇబ్బందులతో చదువు ఆపేయాలనుకున్న ఓ విద్యార్థినికి కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు అండగా నిలిచారు. ఆదివారం హారికకు ఆర్థిక సాయం అందజేసి భవిష్యత్‌లో ఎలాంటి సహాయం కావాలన్నా తోడుగా ఉంటానని హామీ ఇచ్చారు.

గురుపౌర్ణమి వేడుకలకు సర్వం సిద్ధం

ఆలయాల ముస్తాబు



జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని ప్రత్యేక పూజలందుకున్న షిర్డీ సాయిబాబా

రాయదుర్గం: గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం వేడుకలు నిర్వహించేందుకు ఆలయాల్లో భారీగా ఏర్పాట్లు చేశారు. పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీలు సన్నాహాలు చేపట్టాయి.

◆ గచ్చిబౌలిలోని శివసాయి క్షేత్రంలో గురుపౌర్ణమి వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ వాసిరెడ్డి పార్వతి తెలిపారు. ఉదయం 5.30 గంటలకు గణపతి పూజతో ఆలయంలో వేడుకలను ప్రారంభిస్తామన్నారు. అనంతరం విశ్వేశ్వరస్వామి, అన్నపూర్ణాదేవి, షిర్డీసాయిబాబా అభిషేకం, 8 గంటలకు అమ్మవారికి కుంకుమార్చన, బాబావారికి అలంకారం, పుష్పార్చన, 10 గంటలకు గణపతి, శాకంబరి, రేణుక ఎల్లమ్మ, సాయిబాబా, దత్తాత్రేయ హోమం, 12 గంటలకు భాబావారి కి హారతి, మధ్యాహ్నం 1 గంట కు అన్నప్రసాద వితరణ కార్యక్రమం, సాయంత్రం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ప్రత్యేక అర్చన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

అన్నపూర్ణాదేవికి శాకంబరి అలంకారం......

శివసాయిక్షేత్రంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని అన్నపూర్ణాదేవి అమ్మవారికి ప్రత్యేక అలంకారంతో భక్తులకు దర్శనం ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో ప్రత్యేకంగా శాకంబరి అలంకారంలో అమ్మవారు దర్శనం ఇవ్వనున్నారు.

సాయిదత్తగణపతి దేవాలయంలో .....

రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి దేవాలయంలో గురుపౌర్ణమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయంలో ఉదయం 5.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయి. ఉదయం 5.30 గంటలకు సాయిబాబాకు కాగడహారతితో ఉత్సవాలు ప్రారంభిస్తారు.అనంతరం గణపతి, దత్తాత్రేయ, షిర్డీసాయి బాబావారికి పంచామృతాభిషేకం, సాయి అష్టోత్తరాలు, విష్ణుసహస్రనామం, లక్ష్మీ అష్టోత్తర పఠనం, షిర్డీ సాయి సత్యవ్రత ములు, 12 గంటలకు మధ్యాహ్న హారతి, అనంతరం బాబా ప్రసాద వితరణం, సాయంత్రం పల్లకీ సేవ, కొల్హాపూర్ నుంచి వచ్చిన ప్రత్యేక భజన బృందంచే కోలాట ప్రదర్శన నిర్వహిస్తారు. 6.15 గంటలకు సంధ్యా హారతి, 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు భజన బృందంచే ప్రత్యేక భజన కార్యక్రమాలు, 9 గంటలకు శేజ్ హారతి నిర్వహణతో ఉత్సవాలు ముగుస్తాయి

జీపీఆర్‌ఏక్వార్టర్స్ కాలనీలో..

రాయదుర్గం: జీపీఆర్‌ఏక్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయంలో ఉదయం 6 గంటలకు, మధ్యాహ్నం 12, సాయంత్రం 6, రాత్రి 8.30 గంటలకు సాయిబాబావారికి ప్రత్యేక హారతి నిర్వహిస్తారు. ఉదయం 6.30 గంటల నుంచి ప్రత్యేక అభిషేకం, పుష్పార్చన కార్యక్రమాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1 గంటకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం, సాయంత్రం కాలనీలో సాయిబాబా పల్లకీ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఆలయంలో 7.30 గంటలకు ఊంజలసేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

బీజేపీతోనే అన్ని రంగాల అభివృద్ధి



గోకుల్ ప్లాట్స్‌లో ప్రజాయాత్రలో భాగంగా చేపలు అమ్ముతున్న రవికుమార్ యాదవ్

హఫీజ్‌పేట్ : ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధికి బీజేపీని గెలిపించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్‌లో 67వ రోజు గడప గడపకు బీజేపీ రవన్న ప్రజా యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోకుల్ ప్లాట్స్ కాలనీని నిలబెట్టింది మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ అన్నారు. బీఆర్‌ఎస్ నేతలు తొమ్మిదేళ్లలో నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. గోకుల్ ప్లాట్స్‌ను ఇక్కడి నుంచి ఖాళీ చేయిస్తుంటే అడ్డుకుని ప్రభుత్వంతో కొట్లాడి కాలనీని భిక్షపతి యాదవ్ కాపాడారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలను మభ్యపెట్టి ఆయనకు నచ్చిన పథకాలను అమలు చేస్తున్నారన్నారు. పేదల అవసరాలను పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలందరికీ ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాధాకృష్ణ యాదవ్, హరికృష్ణ, మదనా చారి, మహేందర్ యాదవ్, గోవర్ధన్‌రెడ్డి, యాదయ్య, నాగరాజు, ఆనంద్, రంజిత్, సాయి, మని, అజయ్, ఎల్లేష్, పద్మ, పార్వతి, నాగులు, శ్రీనివాస్, అశోక్, అనిల్, వెంకటేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి



అంజయ్యనగర్‌కు చెందిన యువకులతో బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండిరమేష్

గచ్చిబౌలి: యువత రాజకీయాల్లోకి రావాలని బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండిరమేష్ అన్నారు. ఆదివారం కొండాపూర్ డివిజన్ అంజయ్యనగర్‌లో సీనియర్ నాయకుడు తెప్ప బాలరాజ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో యువత ఆత్మీయ సమ్మేళన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి వస్తే ఎన్నో మార్పులు వస్తాయన్నారు. యువతకు పూర్తిగా అండగా ఉంటామన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో యువతకు ప్రాధాన్యత ఉందని, బీఆర్‌ఎస్‌లోనూ యువతకు పెద్దపీట వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జునశర్మ, సంగారెడ్డి, నర్సింగ్‌రావు, శేఖర్‌గౌడ్, రవీందర్, సత్యారెడ్డి, అంజద్, సాయిబాబు, రాహుల్ లడ్డు, విశాల్‌జాన్ అమర్ అరుణ్, ప్రసాద్, సురేష్, కిరణ్‌రాహుల్ పాల్గొన్నారు.

కుంగ్‌ఫూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ప్రారంభం



కుంగ్ ఫూ, మార్షల్ ఆర్ట్స్ అకాడమీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరీనగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన కుంగ్‌ఫూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీని ఆదివారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఆత్మ రక్షణ కోసం కరాటే, కుంగ్ ఫూ దోహదం చేస్తాయన్నారు. పిల్లలకు నైపుణ్యత, ఆసక్తి ఉన్న క్రీడల్లో రాణించే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, బీఆర్‌ఎస్ నాయకులు అకాడమీ నిర్వాహకులు తదితరులున్నారు.

గచ్చిబౌలి-గండి మైసమ్మ బస్సు సర్వీసు ప్రారంభం

నేటి నుంచి రూట్ నెంబర్ 221జీ రాకపోకలు



రాయదుర్గం: ప్రయాణికుల సౌకర్యార్థం బస్సులను నడిపేందుకు గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆర్టీసీ డిపో చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గచ్చిబౌలి నుంచి గండిమైసమ్మ ఆలయం వరకు కొత్తగా బస్సు సౌకర్యాన్ని కల్పించేందుకు నిర్ణయించారు. డిపో మేనేజర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డిపో అధికారులు ఇందుకోసం సోమవారం నుంచి బస్సు సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు ప్రారంభించారు. 221జీ నెంబర్‌తో గచ్చిబౌలి నుంచి గండిమైసమ్మ ఆలయం వరకు బస్సు నడుపుతారు. గచ్చిబౌలి నుంచి ప్రారంభమయ్యే బస్సు అంజయ్యనగర్, కొండా పూర్, హఫీజ్‌పేట్, ఆల్విన్‌కాలనీ ఎక్స్‌రోడ్, మియాపూర్, మియాపూర్ ఎక్స్‌రోడ్, జేపీనగర్, మైత్రినగర్ ఎక్స్‌రోడ్, బీబీడబ్ల్యూ, మియాపూర్ డిపో, మక్తా, బొల్లారం ఐడీఏ ఎక్స్‌రోడ్, బాచుపల్లి, ఎంఎన్‌ఆర్ కాలేజ్, దర్గా, శ్రీచైతన్యకాలేజ్, వీఎన్‌ఆర్ కాలేజ్, ప్రగతినగర్ ఎక్స్‌రోడ్, కైసర్‌నగర్/డీఆర్‌కే కాలేజ్, సూరారం విలేజ్ ఎక్స్‌రోడ్, బౌరంపేట్ ఎక్స్‌రోడ్, మైల్ స్టోన్, మీదుగా గండి మైసమ్మ ఆలయం చేరుకుంటుందని డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. అదే రూట్లో తిరిగి ఈ బస్సు గచ్చిబౌలి వరకు రాకపోకలు సాగిస్తుందన్నారు. గచ్చిబౌలిలో ఈ బస్సు ఉదయం 5.30 గంటల కు ప్రారంభమవుతుండగా చివరి బస్సు రాత్రి 8.25 గంటలకు బయలు దేరుతుంది. గండిమైసమ్మ ఆలయం వద్ద ఉదయం 6.40 గంటలకు ప్రారంభమై చివరి బస్సు 9.40 గంటల కు బయలుదేరుతుంది. ఈ రూట్లోని ప్రయాణికులు ఈ బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీసీ కాలనీలో మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ నిర్మాణాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆదివాంర ఆలయ నిర్మాణానికి రూ.1.50లక్షల విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు భరత్‌చారి, విఠల్‌చారి, సంతోష్‌చారి, అంజన్నచారి, కళ్యాణ్‌చారి, అశోక్‌చారి, యాదయ్య చారి పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

పటాన్‌చెరు టౌన్: డివిజన్‌లో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని పటాన్‌చెరు డివిజన్ అధ్యక్షుడు నాగరాజు యాదవ్ అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని బీజేపీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఆదిత్యవర్ధన్, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా మన్నే రజిని, ప్రధాన కార్యదర్శిగా జ్యోతి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా శిరీష్ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా టప్ప మోహన్ బీజేవైఎం ఉపాధ్యక్షుడిగా నరేష్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సుజాత, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం

జిన్నారం(పటాన్‌చెరు): ప్రజా సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని బీజేపీ మండల అధ్యక్షుడు బండి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. ఆదివారం జిన్నారంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ముందుకు వెళ్తోందని వివరించారు. కార్యక్రమంలో పార్టీ తాత్కాలిక విస్తారక్‌లు సంతోషి, ఉదయ్‌కుమార్, నాయకులు సుధాకర్‌గౌడ్, సాయికిరణ్, జగన్‌రెడ్డి, వీరేష్ పాల్గొన్నారు.

గురు దేవో భవ..

శిల్పారామంలో అలరించిన గురుపూర్ణిమ ఉత్సవాలు



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో గురుపూర్ణిమ సందర్భంగా ఆదివారం నృత్యోదయ కూచిపూడి డాన్స్ అకాడమీ వ్యవస్థాపకులు గురువు డాక్టర్ ప్రసన్న రాణి శిష్య ప్రశిష్యలు గురుపౌర్ణిమ సందర్భంగా గురుపూజ ఉత్సవాన్ని నిర్వహించారు. ఇందులో నటరాజపూజ, గణపతికౌతం, ఆనందనర్తన గణపతిం , శివాష్టకం, బాలకనకయ్య, కళింగనర్తన, తిల్లాన, కృష్ణజననశబ్దం, అన్నమాచార్య కీర్తనలు, దుర్గస్తోత్రం, మండూకశబ్దం, భామాకలాపం, సూర్యాష్టకం, తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. గురువులు చంద్రశేఖర్, భరణీ, నళిని రమణ, రేణుకప్రభాకర్, కృష్ణకుమారి, చంద్రలేఖ, హరిప్రియ గురువుల శిష్యులు ప్రదర్శించి డాక్టర్ ప్రసన్నరాణికి ఘనంగా గురుసత్కారం చేశారు. కార్యక్రమంలో ఓలేట్ రంగమణి, డాక్టర్ జయంతి రెడ్డి, మంజుల రాణి, వరలక్ష్మి కందుకూరి గురుసత్కారం కార్యక్రమంలో పాల్గొని శిష్య ప్రశిష్యులను అభినందించారు.



వైద్యులు సమాజ రక్షకులు



హైదరాబాద్ నాలెడ్జి సిటీలో డాక్టర్లను సత్కరిస్తున్న దృశ్యం

రాయదుర్గం: వైద్యులకు సమాజ రక్షకులుగా అనాదిగా గుర్తింపు ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని హార్డ్ రాక్ కేఫ్‌లో 'ది సేవియర్స్ ఆఫ్ సొసైటీ' పేరిట ట్రైలైట్ లగ్జరీ రెసిడెన్సీస్, ది లగ్జరస్ హై రైస్ టవర్స్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే సందర్భంగా శనివారం రాత్రి పలువురు డాక్టర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో కష్టపడి పనిచేసే వైద్యులను అందరూ గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ఏటా డాక్టర్ల దినోత్సవం నిర్వహించడం, వారిని సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ప్రముఖ వైద్యులు డాక్టర్ అంజలీ గుల్షన్, విక్రమ్ పూసర్ల, రాజాహెగెల్‌తోపాటు పలువురిని ట్రైలైట్ లగ్జరీ రెసిడెన్సీస్, ది లగ్జరస్ హై రైస్ టవర్స్ ప్రాజెక్టు డైరెక్టర్లు జక్కిరెడ్డి సంజీవరెడ్డి, సంజయ్‌గులబాని ఆధ్వర్యంలో సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సంగీత కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు, ఫన్ గేమ్స్ నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, పలువురు డాక్టర్లు,ప్రభుత్వ అధికారులు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా కాలనీల అభివృద్ధి

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: జీహెచ్‌ఎంసీ పరిధిలోని డివిజన్‌లలో నూతనంగా ఏర్పడుతున్న కాలనీలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సింఫనీ కాలనీలో రూ. 42 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో కాలుష్యానికి చిరునామాగా ఉండే ఈ ప్రాంతం నేడు గేటెడ్ కమ్యూనిటీలతో అభివృద్ధి చెందడం సంతోషకరమన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. పది కాలనీల ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



అ'పూర్వ'ం

- ఉన్నత విద్యాసంస్థల్లోని పూర్వ విద్యార్థుల ప్రతిభ భళా
- సత్తాచాటిన ఇద్దరు హెచ్‌సీయూ...
- ఇద్దరు ఐఎస్‌బీ పూర్వవిద్యార్థులు
- జాతీయ స్థాయిలో గుర్తింపు



ఐఎస్‌బీ పూర్వ విద్యార్థి మయాంక్ కుమార్



'మ్యాట్రిక్స్' సంస్థ ఎండీ రజత్ అగర్వాల్



ఎన్‌ఐఎన్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం సుబ్బారావు



హెచ్‌సీయూ పూర్వ విద్యార్థి గణేష్ పుత్తూరు

రాయదుర్గం: ఉన్నత విద్యాసంస్థల్లో చదివిన పూర్వ విద్యార్థులు సత్తాను చాటుతున్నారు. ఉన్నత విద్యాసంస్థల్లో తమ చదువు పూర్తయిన తర్వాత వృత్తిలో కొనసాగుతూనే తమకంటూ ప్రత్యేకతను నిలుపుకుంటుండటం విశేషం. గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)లో ఇద్దరు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)కి చెందిన ఇద్దరు పూర్వ విద్యార్థులకు అరుదైన అవకాశాలు లభించాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించిన ఈ రెండు ఉన్నత విద్యాసంస్థల్లోని విద్యార్థులకు గుర్తింపు రావడం మరో విశేషం. రెండు రోజుల క్రితం వీరికి ప్రకటించిన గుర్తింపును పరిశీలిస్తే

'అండర్ ఫార్టీ-2023'లో ఐఎస్‌బీ పూర్వ విద్యార్థులు

◆ 'ది ఎకనామిక్ టైమ్స్' భారతదేశంలో 'అండర్ ఫార్టీ-2023' సర్వేలో గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)కు చెందిన ఇద్దరు పూర్వ విద్యార్థులకు చోటు లభించడం విశేషం.

◆ భారతదేశ అగ్రశ్రేణి వ్యాపార నాయకులు, వ్యవస్థాపకుల్లో 40 ఏళ్లలోపు నిపుణులను గుర్తించే జాబితాలో పీజీపీ కో-2009 విద్యార్థి, 'అప్‌గ్రాడ్' సంస్థ సహ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ మయాంక్ కుమార్, అదేవిధంగా పీజీపీ కో-2011 విద్యార్థి, 'మ్యాట్రిక్స్' సంస్థ పార్ట్‌నర్స్ మేనేజింగ్ డైరెక్టర్ రజత్ అగర్వాల్‌లకు ఈ అవకాశం లభించడం విశేషం.

◆ చిన్న వయస్సులో అరుదైన ప్రతిష్టాత్మక గుర్తింపు పొందిన వారిని ఐఎస్‌బీ ప్రొఫెసర్లు, అధికారులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు అభినందించారు.

ఎన్‌ఐఎన్ శాస్త్రవేత్తకు గుజరాత్ సైన్స్ అకాడమీ అవార్డు

◆ హెచ్‌సీయూ పూర్వ విద్యార్థి, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్(ఎన్‌ఐఎన్)లో శాస్త్రవేత్త డాక్టర్ ఎం సుబ్బారావు సైన్స్, పరిశోధనా రంగంపై అవగాహన కల్పించినందుకు గుజరాత్ సైన్స్ అకాడమీ (జీఎస్‌ఏ) అవార్డును అందుకున్నారు.

◆ జీఎస్‌ఏ ఏటా అంతర్జాతీయ స్థాయిలో పరిశోధకులను ఎంపిక చేసి ఈ అవార్డును అందిస్తోంది. డాక్టర్ సుబ్బారావు హెచ్‌సీయూలో 1996-98లో ఎంఏ కమ్యూనికేషన్ పూర్తి చేయగా, 2004-10లో ఎస్‌ఎన్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్‌లోని కమ్యూనికేషన్ విభాగం లో ప్రొఫెసర్ వినోద్ పవరాల మార్గదర్శకత్వంలో హెల్త్ కమ్యూనికేషన్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈ అవార్డు అందుకోవడంతో ఆయనను పూర్వ విద్యార్థులు, ప్రొఫెసర్లు అభినందించారు.

గణేష్ పుత్తూరుకు సాహిత్య అకాడమీ యువ పురస్కారం.....

◆ హెచ్‌సీయూ పూర్వ విద్యార్థి గణేష్ పుత్తూరు ప్రతిష్టాత్మక సాహిత్య అకాడమీ యువ పురస్కారానికి ఎంపికయ్యారు.

◆ హెచ్‌సీయూలో ఎంఏ హిస్టరీ 2018-20బ్యాచ్‌లో విద్యార్థి అయిన అయన 'అచంటే అలమారా' పేరిట రాసిన కవితా సంకలనానికి మలయాళ భాషలో ప్రతిష్టాత్మక సాహిత్య అకాడమీ యువ పురస్కారాన్ని అందుకోనున్నారు.

◆ సాహిత్య అకాడమీ ఏటా భారతీయ భాషల యువ రచయితలకు గుర్తించి ప్రోత్సహించేందుకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తుంది.

◆ అవార్డు కోసం చివరి ఐదు సిఫార్సుల నుంచి గణేష్ కవితా సంకలనాన్ని జ్యూరీ ఏకగ్రీవం గా ఎంపిక చేసింది. ఆయనకు రాగి ఫలకంతో కూడిన అవార్డు, రూ.50 వేల చెక్కు అందిస్తారు. ఈ సందర్భంగా ఆయనను హెచ్‌సీయూ ప్రొఫెసర్లు, విద్యార్థులు అభినందించారు.